ప్రజాశక్తి

గురువారం 20 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

స్థలాల ధరలు అంతంతే....

అపార్టుమెంట్ల ధరలు అంతకు మించి

విశాఖలో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంపైనా ప్రభావం

కోవిడ్ కాలంలోనే రిజిస్ట్రేషన్లు 81శాతం

2022-23లో 79శాతానికే పరిమితం...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనే ఒక వ్యాపార కేంద్రంగా విశాఖకు పేరున్న విషయం తెలిసిందే. ఇక్కడ ఎప్పుడూ రిజిస్ట్రేషన్ శాఖకు కాసుల వర్షమే కురిసేది. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో గత కోవిడ్ ఏడాది కంటే కాస్త మందకొడిగానే ఉందని చెప్పొచ్చు. సిమెంట్, స్టీల్ ధరల పెరుగుదలతో ఫ్లాట్ల ధరాభారంతో మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు కోకొల్లలుగా నగరంపై వచ్చి పడుతున్నాయి. ఇది సహజమైన పరిణామమే అయినా స్థలాల ధరల్లో పెద్దగా పెరుగుదల లేదని క్రెడాయ్ ప్రతినిధులు చెబుతున్నారు. స్థలాల ధరల పెరుగుదల కేపిటల్ అభివృద్ధి అన్న అంశం చుట్టూ తిరగడమే కారణమ్నది వీరు వెల్లడిస్తున్నారు. ఇంకా ఆ దిశగా కేపిటల్ ఏరియా డెవలప్‌మెంట్ అన్నది జరగకపోవడంతో కొంతమేర స్థలాల రేట్లపై భారీ పెరుగుదల ప్రభావం ఏమీ లేదన్నది తెలుస్తోంది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శ్రీకాకుళం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 'మీ బిడ్డ విశాఖ నుంచి పాలన చేయడానికి సిద్ధమయ్యాడంటూ' ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏటా ఈ ప్రకటనలు వస్తున్నా పెద్ద చెప్పుకోదగిన అభివృద్ధి అంటూ ఏమీ కనిపించనందున స్థలాల రేట్లలో పెద్ద మార్పు లేదన్నది భోగట్టా. అదే సందర్భంలో కొన్ని కీలకమైన స్థలాలను వైసిపి ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి చేజిక్కించుకున్న ఆరోపణలు తెలిసిందే. బే పార్కు, తాజాగా రామానాయుడు స్టూడియో, సిరిపురం జంక్షన్ వద్ద సిబిసిఎన్‌సి స్థలం, సర్క్యూట్ హౌస్ వద్ద స్థలాల ఆక్రమణలూ వైసిపి మెడకు చుట్టుకున్నాయి. స్థలాలను చేజిక్కించుకోవడం ఒక వైపునుంచే ఇలా జరగడం, రాజధాని విషయం కోర్టుల్లో ఉండడంతో సాధారణ స్థలాల రేట్లపై ప్రభావం లేదన్నది తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ మదుపరులు అపార్టుమెంట్ల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. డబల్ బెడ్‌రూమ్ కనీసం రూ.70లక్షలు తక్కువ లేదు. 3 బెడ్‌రూమ్ ఇళ్లయితే రూ.కోటి దాటే. సామాన్య మధ్యతరగతి వాళ్లు కొనలేని పరిస్థితులు విశాఖలో దాపురించాయి.

రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని చూస్తే....

గత ఆర్థిక సంవత్సరం 2022-2023లోనే విశాఖ జిల్లా నుంచి రూ.815.80కోట్ల ఆదాయం రాగా 2021-22లో రూ.859.88కోట్లు వచ్చింది. అంటే రూ.44.88కోట్లు ఈ ఏడాది కంటే అదనంగా అంతకు ముందే వచ్చింది. వాస్తవానికి రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల లెక్కలను తీసుకుంటే ప్రతి ఏటా రూ.50 నుంచి రూ.95కోట్ల వరకూ అదనంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం కనీసం పెరుగుతుంది. విశాఖలో ఈ పరిస్థితిపై మిగతా 2లో..

పెరిగిన విద్యుత్ వినియోగం

రోజుకు 31 మిలియన్ యూనిట్లు నమోదు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఎండలు సుర్రుమంటున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎండల తీవ్రత, ఉక్కబోత భరించలేక ఉదయం 8 గంటల నుంచి పిల్లలు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళితే వడదెబ్బ తగులుతుందన్న భయం కలిగేలా ఎండల తీవ్రత ఉంది. ఎండలు పెరగడంతో ఎసిల వాడకం అధికమైంది. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఏప్రిల్ ఒకటిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 27.822 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తే, ఏప్రిల్ 18 నాటికి 31.116 మిలియన్ యూనిట్లకు విద్యుత్ వినియోగం పెరిగింది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఉమ్మడి విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఎల్‌టి కేటగిరిలో 17,20,992 కనెక్షన్లు, హెచ్‌టి కేటగిరిలో 1724 కనెక్షన్లు ఉన్నాయి. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఆందోళనకర స్థాయిలో ఉండటంతో విద్యుత్ వినియోగం పెరిగింది. సాధారణ లోడ్‌కు మించి విద్యుత్ వినియోగం ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయి. విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం కలుగుతోంది. ఈ నెల 12వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం క్రమంగా పెరిగింది. ప్రస్తుతం రోజుకు 31 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదవుతోంది. ఉక్కబోత వల్ల పగలు, రాత్రి ఎసిల ఉపయోగిస్తుండడంతో విద్యుత్ వినియోగం భారీ స్థాయిలో పెరిగినట్లు విద్యుత్‌శాఖాధికారులు చెబుతున్నారు. వినియోగానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడానికి ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు.

ఏప్రిల్ 1 నుంచి 18 వరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విద్యుత్ వినియోగం ఇలా ఉంది...

తేదీ	వినియోగం (మిలియన్ యూనిట్లలో)
1.	27.822
2.	27.009
3.	28.234
4.	29.229
5.	28.924
6.	30.201
7.	28.950
8.	29.259
9.	28.762
10.	29.872
11.	29.864
12.	31.302
13.	31.197
14.	31.167
15.	31.206
16.	30.792
17.	31.522
18.	31.116

వడదెబ్బతో వ్యక్తి మృతి

▶ వార్త 5లో..

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నిలబడతా : కెఎ.పాల్

▶ వార్త 2లో..

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'నెమలిపురి'కి చోటు

▶ వార్త 4లో..

ఆదర్శనీయులు కృష్ణమూర్తి

-అశ్రునయనాల నడుమ అంతిమయాత్ర

-ప్రముఖుల నివాళి

కృష్ణమూర్తి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంవిఎస్.శర్మ, జగ్గునాయుడు, కుమార్ తదితరులు

ప్రజాశక్తి - ఆరిలోవ : సిపిఎం సీనియర్ నాయకులు వి.కృష్ణమూర్తి ఆదర్శమూర్తి అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహ్మాన్, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, వైసిపి, టిడిపి నాయకులు కొనియాడారు. సిపిఎం ఆరిలోవ ప్రాంత నాయకులు, సిపిఎం జిల్లా కార్యాలయ అకౌంటెంట్ వి.కృష్ణమూర్తి గుండెపోటుతో మృతిచెందడంతో ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్ అధ్యక్షతన బుధవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కృష్ణమూర్తి 1984లో ఆరిలోవకాలనీ ఏర్పడిన నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఐద్వా మిగతా 2లో..

ప్రధాన వార్త మెయిన్ 3లో...



మొదటి పేజీ తరువాయి..

స్థలాల ధరలు అంతంతే...

తాజాగా రిజిస్ట్రేషన్, రెవెన్యూ బృందాలు అధ్యయనం చేస్తోన్న వారిలో ఓ అధికారి స్థలాల క్రయ విక్రయాలపై ప్రభావం ఉందన్నది వెల్లడించారు. విశాఖలో 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గత సంవత్సరంలో ప్రభుత్వం రూ.1020 కోట్ల వరకూ లక్ష్యం విధించింది. పరిపాలన రాజధాని ప్రకటనలతో కనీసం రూ.1000కోట్లు వస్తుందని అంచనా వేశారు. కోవిడ్ కాలంలోనే 81శాతం రిజిస్ట్రేషన్ల లక్ష్యాన్ని విశాఖ చేరుకోగా తాజాగా 79శాతానికే పరిమితమైంది.

ఆదర్శనీయులు కృష్ణమూర్తి

ఆలిండియా కోశాధికారి ఎస్.పుణ్యవతి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ జిల్లా నాయకులుగా ఉన్నప్పుడే ఆయన సిపిఎం సాధారణ సభ్యత్వాన్ని పొంది ప్రజా సేవకు అంకితమయ్యారని కొనియాడారు. పేదరికం పోవాలని, అందరికీ సమాన హక్కులు, దేశంలో కార్మికరాజ్యం రావాలన్న సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన కుమార్తె, కోడలు ఆశాలుగా పనిచేస్తూ సిఐటియు తరుపున ఆశ వర్కర్ల సమస్యలపై పనిచేస్తున్నారని తెలిపారు. 20 సంవత్సరాలుగా పార్టీ జిల్లా కార్యాలయ అకౌంటెంట్ బాధ్యతలు చూస్తున్నారని పేర్కొన్నారు. ఆయన మృతి వారి కుటుంబానికి, పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎఎంసికి పార్థివ దేహం అప్పగింత

కమ్యూనిస్టుగా జీవించడమే కాకుండా మరణించిన తరువాత కూడా ప్రజలకు ఉపయోగపడే విధంగా కళ్లను ఐ బ్యాంక్‌కు దానం చేశారు. విద్యార్థుల పరిశోధన నిమిత్తం పార్థివదేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగించారు.

అశ్రునయనాలతో అంతిమయాత్ర

కృష్ణమూర్తి అంతిమ యాత్ర పార్టీ శ్రేణులు, కార్మికులు, బంధు మిత్రులు అశ్రునయనాల మధ్య సాగింది. ఆరిలోవ టిఐసి పాయింట్ వద్ద గల కృష్ణమూర్తి ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర ఆరిలోవ శ్రీలీలాసుందరయ్యనగర్‌లో గల సిఐటియు కార్యాలయం వరకు చేరుకుంది. అక్కడ స్థానికుల సందర్శనార్థం కొంతసేపు ఉంచారు. అక్కడ నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పెదగదిలి, హనుమంతువాక మీదుగా ఆంధ్రా మెడికల్ కాలేజీకి తరలించారు. పార్థివ దేహాన్ని కాలేజీకి అప్పగించారు. అంతిమ యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాస్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, అనకాపల్లి జిల్లా నాయకులు జి.కోటేశ్వరరావు, శంకర్, బాలకృష్ణ, శ్రీరామ్, శ్రీనివాస్, నాయనిబాబు, సిఐటియు నాయకులు పి.మణి, కుమార మంగళం, జ్యోతీశ్వరరావు, పోలేశ్వరరావు, సిపిఎం జోన్ నాయకులు బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ, పి.శంకరరావు, గౌరి, రామకృష్ణ, నాగరాజు, సత్యనారాయణ, కుమారి, పి.వెంకటరావు, భారతి, కొండమ్మ అప్పలరాజు, వివిధ గ్రామ సంఘాల నాయకులు సత్యనారాయణ, దేవుడు, అప్పలనాయుడు, అప్పారావు, మహిళా నాయకులు, విద్యార్థి, యువజన సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పలువురు సంతాపం...

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాధం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, బాలల రంగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తదితరులు కృష్ణమూర్తి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

స్టూడియో భూమి కేటాయింపుపై విచారణ జరిపించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు లేఖ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖలో రామానాయుడు స్టూడియోకు ప్రభుత్వం కేటాయించిన భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు కేటాయింపు చేసిన అంశంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యదర్శికి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు లేఖ రాశారు. 2002లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం విశాఖలో రామానాయుడు స్టూడియోకు 32 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. కేటాయించిన భూమిలో కొద్ది భాగంలో కొన్ని నిర్మాణాలు చేసి 2008 నుంచి స్టూడియో కార్యక్రమాలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్టూడియోకి కేటాయించిన భూమిని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌కు ఇవ్వాలని ప్రభుత్వంలోని పెద్దలు ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. ఆ ప్రతిపాదనను విరమించి ఇప్పుడు వైసిపి ప్రభుత్వంలోని కొందరు నాయకులు దగ్గుబాటి సురేష్‌బాబుపై ఒత్తిడి తెచ్చి 15 ఎకరాలను కేటాయించుకున్నారని వివరించారు. ఇప్పుడు ఈ భూమిని రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇది పెద్ద భూ కుంభకోణం అని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్‌లో రిక్రియేషన్, ఓపెన్ స్పేస్ భూవినియోగ నిబంధన కింద ఉన్న దానిని అత్యంత రహస్యంగా మిశ్రమ వినియోగం కిందకి మార్చేశారని తెలిపారు. వాస్తవంగా ప్రభుత్వం ఒక ప్రయోజనం కోసం కేటాయించిన భూమిని ఇతర ప్రయోజనాలకు గాని, ఇతర వ్యక్తులకు, సంస్థలకు కేటాయించటం చట్ట విరుద్ధం అని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చేయకూడదని కలెక్టర్ నుంచి ఎన్ఒసి పొందాల్సి ఉన్నప్పటికీ ఇవేవీ జరగలేదని, ఒకవేళ ఈ పక్రియ జరిగితే ప్రభుత్వం ఎందుకు ఈ చర్యకు పాల్పడిందో నేటికీ వివరణ ఇవ్వలేదని తెలిపారు. ఆ స్థలంలో ఇప్పటికే లే అవుట్ వేశారని, సురేష్‌బాబు పేరు మీద 15 ఎకరాల్లో భారీ భవనాల నిర్మాణానికి ప్లాన్ అనుమతి కోసం జివిఎంసికి దరఖాస్తు చేశారని వివరించారు. కొంత భూమిని మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనఖా కూడా పెట్టారని తెలిపారు. ఈ భూమి విలువ సుమారు రూ.300 కోట్లకుపైగానే ఉంటుందని పేర్కొన్నారు. గతంలో రాడీసన్ రిసార్ట్స్‌ను, బే పార్క్‌ను కూడా వైసిపి బడా నాయకులు కొందరు తమ వశం చేసుకున్నారని తెలిపారు. ఇటీవల దసపల్లా భూములు, సిరిపురం జంక్షన్‌లో ఉన్న చర్చి భూమిని కూడా అధికారులను లోబర్చుకొని భారీ అక్రమాలకు పాల్పడ్డారని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తక్షణం జోక్యం చేసుకొని రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూమిలో జరిగిన భారీ భుకుంభకోణంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

చందనోత్సవాన్ని విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ విశాఖ : సింహాచలంలో ఈ నెల 23న జరిగే చందనోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతంచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చందనోత్సవం సందర్భంగా ఈ నెల 23న తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.30 మధ్య ఆలయ ధర్మకర్త, వారి కుటుంబ సభ్యులతో పాటు దేవాదాయశాఖ మంత్రివర్యులు స్వామివారిని దర్శించుకుంటారని, అదే సమయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. 3.30 నుంచి 4.30 గంటల మధ్య విఐపి దర్శనాలు, దేవస్థాన ట్రస్టు సభ్యులు స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. కేటాయించే టిక్కెట్లలో దర్శన టైమింగ్స్‌ను ముద్రించడం జరుగు తుందన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000 దర్శనం టైమింగ్స్‌తో కూడిన టిక్కెట్లపై భక్తులు దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. విఐపిలు స్లాట్ 1 ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య , స్లాట్ 2 ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మీడియాకు ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య దర్శనం ఉంటుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి 20 మీటర్లకు ఒక వాటర్ పాయింట్ ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. కొండపైన దిగువ పుష్కరిని, భైరవ కోన, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహించాలన్నారు. భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాలలో అవసర మైన చోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, నడక మార్గంలో కూడా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ, రోడ్లు భవనాలు శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, పోలీసు కమిషనర్ త్రివిక్రమ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, సింహాచల ఇఒ త్రినాథరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అజాద్, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుసేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నిలబడతా : కెఎ.పాల్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా రక్షించేందుకు తాను నిలబడతానని కెఎ.పాల్ చెప్పారు. విశాఖలో బుధవారం సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎక్కువ మంది ఆధారపడి ఉన్నందున దానిని ఎవరికీ విక్రయించవద్దని చెప్పానని, తాను అధికారికంగా ఒక సంవత్సరం క్రితం కొనుగోలు చేయడానికి ప్రతిపాదించానని, అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ భూమి, భవనాల వాస్తవ ధర 45 బిలియన్ అమెరికా డాలర్లు అంటే దాదాపు రూ.3.5 లక్షల కోట్లు ఉందని తెలిపారు. తాను 5 బిలియన్ డాలర్లను అంటే రూ.40,000 కోట్లును 6 నెలల్లో ఈ ప్రభుత్వానికి చెల్లిస్తానని తెలిపారు. తన ప్రతిపాదనను అంగీకరించి తెలుగు ప్రజలందరూ కోసం ఆలోచించాలని కోరారు. తాను సంబంధిత మంత్రులందరితో మాట్లాడానని, దాదాపు 15 నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు.

నగరంలో ఏజెంట్ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అఖిల్ అక్కినేని హీరోగా సురేంద్రరెడ్డి దర్శకత్వంలో రూపొందించిన ఏజెంట్ చిత్రం ఈ నెల 28న విడుదల అవుతున్న సందర్భంగా చిత్ర బృందం విశాఖలో సందడి చేసింది. నోవాటెల్ హోటల్‌లో మీడియాతో చిత్ర కథానాయకుడు అఖిల్ అక్కినేని మాట్లాడుతూ, విశాఖ నగరం అంటే ఎంతో మక్కువ అని, ఈ చిత్రం షూటింగ్ కొంత భాగం విశాఖలో జరిగిందని తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రానికి హిప్ హప్ తమీజ్ అద్భుతమైన సంగీతంతో పాటు మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారని తెలిపారు. చిత్ర కథానాయక సాక్షి విద్య మాట్లాడుతూ, తనకు ఈ చిత్రం మొదటిదని, తన పాత్ర వైవిధ్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

హీరో వెంకటేష్‌కు 'పీవీ జీవిత చరిత్ర'పుస్తకం అందజేస్తున్న అతని స్నేహితులు

హీరో వెంకటేష్‌కు 'పీవీ జీవిత చరిత్ర'పుస్తకం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సినిమా షూటింగ్ నిమిత్తం విశాఖ వచ్చిన హీరో వెంకటేష్‌కు 'పీవీ జీవిత చరిత్ర' పుస్తకాన్ని ఆయన మిత్రులు అందజేశారు. అక్కయ్యపాలేనికి చెందిన ఉపాధ్యాయుడు భాగవతుల శంకర్ రచించిన పీవీ జీవిత చరిత్ర పుస్తకంలోని విశేషాలను వెంకటేష్‌కు వివరించారు. విశాఖలోని శర్మ ఆప్టికల్స్ యజమాని వాసు స్నేహితుడని, పీవీ చరిత్ర పుస్తకాన్ని అందజేసినందుకు ఆనందంగా ఉందని వెంకటేష్ పేర్కొన్నారు.

బహిరంగ వేలంపాట వాయిదా

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జివిఎంసి 4వ జోన్ (సూర్యాభాగ్)కు సంబంధించిన మార్కెట్ బహిరంగ వేలంపాటకు గుత్తేదారులు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. పూర్ణామార్కెట్ (ఎస్‌విపి మార్కెట్), రామకృష్ణ మార్కెట్ (రైతు బజారు), రెల్లి వీధి రోడ్ సైడ్ మార్కెట్‌లకు బుధవారం వేలం నిర్వహించగా ఇద్దరు గుత్తేదారులు పాల్గొన్నారని, నిబంధనలకు అనుగుణంగా ఆసక్తి చూపని కారణంగా అధికారుల ఆమోదంతో బహిరంగ వేలం పాటను నిలుపుదల చేసినట్లు వివరించారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఉదయం 11 గంటలకు మరలా బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION VISAKHAPATNAM

PUBLIC NOTICE

E-File No.339851, Dt.18-04-2023

The Commissioner, Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam has approved Road development plan showing the proposed 100'-0" MP Road from Bakkannapalem Tidco Housing Junction to Bakkannapalem Forest Boundary Via CRPF Training center in Sy.No.21P, 38 to 41P, 101P, 102P, 105P & 100 of Bakkannapalem Village as per G.O. Ms. No. 180 MA & UD, Dt.01.10.2020. Hence, the general public are here by informed to submit their objections/ suggestions if any, in this regard within 15 days from the date of publication of this notification to Zonal Office, Zone-II, Madhurawada, GVMC pertaining to the above approval of 100'-0" MP Road from Bakkannapalem Tidco Housing Junction to Bakkannapalem Forest Boundary Via CRPF Training center failing which it will be considered that there are no objections/suggestions etc., and the above approval of Road Development Plan (RDP) will be processed as per rules.

S/d-Commissioner, GVMC, Visakhapatnam

IN THE COURT OF THE HON'BLE MACT CUM XXVI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD

O.P.No. **279** of **2021**

Between:
V. Srinu
...Petitioners
And
ChandrashekharThammana and others
...Respondents

To, R3
R3. Shiva Sammangi S/o Nageswar, Age:major, Occ : Driver Of DCM bearing No. AP 31 TD 4523, R/o. D. No. 9-10, Gokulapadu (V), S. Rayavaram IM), Visakhapatnam, A.P. 531060.

Whereas the above named petitioner filed the above O.P. for Compensation U/s. 166 MV ACT against You and another and the matter is posted for appearance and counter, if any. Hence you are hereby required to appear before this Hon'ble Court on **15-05-2023** at **10.30** A.M. either in person or through an Advocate, duly instructed by you, failing which the matter will be decided on merits, by setting you exparte.

// By order of the Court //

M/s. D.RAVI KUMAR
S. RAVINDER REDDY
Advocates
Bhavani Nilayam, IIIrd Floor ,
Flot No.302, Plot No. 01,
H.No. 1-1-382/N/1, Nagarjuna Colony,
Opp. Focus Hospital, Champapet,
Hyderabad-500079.

ట్రైనీ తహశీల్దార్‌గా మాధవి

కె.మాధవి

ప్రజాశక్తి,-ఆనందపురం: మండలంలో ట్రైనీ తహశీల్దార్‌గా కె.మాధవి విధుల్లో చేరారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై, జిల్లాలో శిఓణకు వచ్చిన మాధవి, వివిధశాఖల్లో శిక్షణలో భాగంగా ఆనందపురంలో ఈ నెల 16 నుంచి వచ్చేనెల 14వరకు నెలరోజులపాటు శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో పనులు పర్యవేక్షించి, మండలంలో జరుగుతున్న రెవెన్యూ కార్యకలాపాలపై పర్యవేక్షణ చేస్తారు. శిక్షణ అనంతరం వేరే కార్యాలయానికి వెళతారు.

విద్యార్థులకు హిందీ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎంపిపి డివిఎస్ఎస్ఎన్ రాజు ఆర్థిక సాయం రూ.10 వేలతో కొనుగోలు చేసిన హిందీ పరిచయ పుస్తకాలను 6, 7 తరగతుల విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు జివిఎంసి హైస్కూల్‌లో నిర్వహించినకార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ, హిందీ పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సాయం చేసిన ఎంపిపిని అభినందించారు. ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ, హిందీపై ఆసక్తి గల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సుజాతాకుమారి, ఉపాధ్యాయులు అల్లాడ శ్రీనివాసరావు, ఐ.వెంకటరావు, ఎం రామకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు

వెంకటాపురంలో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-పద్మనాభం : ఎపి పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, మేలు జాతి పశువుల అభివృద్ధికి ప్రస్తుతం ఎన్నో అవకాశాలున్నాయన్నారు. ఆడదూడలు పుట్టేందుకు అవసరమైన కృత్రిమ గర్భధారణ ఇంజిక్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వపరంగా రాయితీ ఇస్తున్న వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన దూడలను ఎంపిక చేసి, పెంపకందారులైన రైతులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా దూడలకు ఏలికపాముల నివారణకు మందును తాగించారు. కార్యక్రమంలో భీమిలి వెటర్నరీ ఏడీ డాక్టర్ బివి.రమణ, పాండ్రంగి పశు వైద్యాధికారి అనుపమ పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన 21రోజుల కానుకలనుబుధవారం లెక్కించారు. రూ1,32,74,645 నగదు, 65.500 గ్రాముల బంగారం, 10.900 కేజీల వెండితోపాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం ఇఒ వి.త్రినాధరావు, వు సహాయ కమిషనర్ సుజాత, దేవస్థానం అధికారులు సిబ్బంది స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

అప్పన్న దర్శనానికి వస్తున్న భక్తులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దేవస్థానంలో ప్రతి ఏటా గంధ అమావాస్య రోజున అధిక సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. సింహాచలం చేరుకొని వరాహ పుష్కరిణి వద్ద స్నానమాచరించి వంట వార్పులు చేసుకుని నిర్వహిస్తూ సేవ గరిడీలు నిర్వహిస్తూ కాలినడకన మెట్ల మార్గంలో సింహగిరికి చేసుకొని స్వామి గాలిగోపురం ఎదురుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆరిలోవ హెల్త్‌సిటీ, అపోలో ఆసుపత్రి వద్ద ఆసుపత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రిలోపల, ఆవరణలో అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిపై వెంటనే ఎలా స్పందించాలి, ఎలా నివారించాలన్న వాటిపై మాక్‌డ్రిల్ నిర్వహించి, ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి ఆర్‌వి.రమణ, లీడింగ్ ఫైర్‌మ్యాన్ సిహెచ్.లక్ష్మీనారాయణ, రవికుమార్, జి.గోవింద, టి.గోవర్ధన్ పాల్గొన్నారు.

ఉక్కపోత... కరెంటు కోత..

- రాత్రిపూట వేళాపాళా లేని విద్యుత్ కోత
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న జనాలు
- నాలుగైదు రోజులుగా ఇదే పరిస్థితి ..
- పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ

వేసవి మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు అనధికార కరెంట్ కోతలు ఆశనిపాతంగా మారుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. అదీ రాత్రి పూట అనధికారికంగా గంటల తరబడి వేళాపాళా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపేస్తుండడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. పగలంతా ఏదో పనులు చేసుకొని రాత్రి పూట కాస్త సేద తీరదామంటే అనధికార విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్నారు. ఉక్కపోతకు విద్యుత్ కోతలు తోడవ్వంతో నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. రాత్రి పూట ఇష్టారాజ్యంగా విద్యుత్‌ను నిలిపేయడంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. 12వ వార్డు శ్రీలీలాసుందరయ్యనగర్ పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా రాత్రిపూట విద్యుత్‌కు అంతరాయం కలగడంతో తెల్లవార్లు స్థానికులు నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది. అసలే విద్యార్థులకు పరీక్షలు సీజన్ కావడంతో రాత్రులు నిద్రలేక, ఉదయాన్నే పరీక్షలకు హాజరుకావడం కత్తి మీద సాములా మారిందని ఆందోళన చెందుతున్నారు. . గత రెండు రోజులుగా అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు విద్యుత్ లేక పోవడంతో చంటి పిల్లలు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రాత్రి పూట విద్యుత్ లేక పోవడంతో ఒక వైపు దోమలు, మరోవైపు ఉక్కపోతతో స్థానికులు ఉక్కిరి బిక్కిరితో రోడ్లు మీదే గడపాల్సిన పరిస్థితి వచ్చింది. ఆగ్రహించిన ప్రజలు అర్ధరాత్రి పూట సంబంధిత అధికారులకు ఫోన్లో పిర్యాదు చేద్దామంటే ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో విసిగిపోయి శాపనార్థాలు పెడుతున్నారు. ఏటా వేసవిలో ఇదే దుస్థితి నెలకొనడంపై ఆవేదన చెందుతున్నారు.. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోడ్ రిలీఫ్ పేరిట యథేచ్ఛగా కొనసాగుతున్న అనధికార విద్యుత్ కోతలపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, పాత ట్రాన్స్‌ఫార్మర్లు మార్పుచేయడంతోపాటు ఆయాప్రాంతాల విద్యుత్ లోడ్ ఆధారంగా అదనపు సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రస్తుత వేసవిలో అనధికారి విద్యుత్ కోతల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. బుధవారం సింహాచలం వచ్చిన ఆయనకు ఆలయ ఇఒ వి.త్రినాధరావు సహాయ కమిషనర్ సుజాత ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఈసందర్భంగా సింహాద్రి అప్పన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఈనెల 23న నిర్వహించనున్న చందనోత్సవ ఏర్పాట్లుపై ఇఒ, ఇతర దేవాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చందనోత్సవం రోజున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి క్యూలైన్లు, అవసరమైన నీడ, తాగునీటి సదుపాయం, వైద్యశిబిరాలు, భద్రతా పరమైన అన్ని

దేవాదాయ కమిషనర్‌ను స్వాగతిస్తున్న ఇఒ, ఎఇఒ

ఏర్పాట్లు చేయవాలని సూచించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, చిన్నారులకు పాలు బిస్కెట్లు,ఇ తరత్రా సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు వచ్చే స్వచ్ఛందసంస్థల ప్రతినిధులకు స్వామి దర్శనాలకు భక్తులు వెళ్లే క్యూలైన్లలో కాకుండావేరేగా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని సూచించారు.

వైఎస్ భారతి కనుసన్నలలోనే భూ దందాలు

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి కనుసన్నలోనే భూదందాలు జరుగుతున్నాయని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖలో రామానాయుడు స్టూడియోకి గతంలో ఇచ్చిన స్థలాన్ని రియల్ ఎస్టేట్‌గా మారుస్తున్నారన్నారు. చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడం కోసం మాత్రమే 33 ఎకరాలను నామ మాత్రపు ధరకు కేటాయించారని, అటువంటప్పుడు హైరేంజ్ టవర్స్ కట్టేందుకు ఎలా ఎల్పీ ఇచ్చారో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. అది సిఆర్ జెడ్ నిబంధనలకు విరుద్ధంగా భారీ విల్లాలకి ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. నిర్మాణాలు చట్టవిరుద్ధంగా కట్టడమే కాకుండా, అమ్ముకోవాలని చూస్తున్నారని విమర్శించారు. బినామీల పేరున రిజిస్ట్రేషన్ చేయబోతున్నారన్నారని, వాటిని భవిష్యత్తులో రద్దు చేస్తామని చెప్పారు. రామానాయుడు స్టూడియోకు ఇచ్చిన 33 ఎకరాల్లో 17 ఎకరాలకు కమిషనర్ ఎలా అనుమతులు ఇచ్చారో చెప్పాలన్నారు. గజం 60 వేల చొప్పున అమ్మకానికి పెడుతున్నారని తెలిసిందన్నారు. కన్జర్వేటర్‌లో ఉన్న ప్లాన్‌ను మిక్స్‌డ్ జోన్‌లోకి మార్చేశారని ఆరోపించారు.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

ప్రజాశక్తి-విశాఖపట్నం : శ్రీకాకుళం జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్నాథ్, ఎంపీలు బి.సత్యవతి, జి.మాధవి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జికలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సిపి త్రివిక్రమ్ వర్మ, జెసి కెఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఐ.పృధ్వీతేజ్, విఎమ్ఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్లో శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు. శ్రీకాకుళం పర్యటన అనంతరం విశాఖ విమానాశ్రయంలో ఘన వీడ్కోలు పలికారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ టిఐసి పాయింట్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరిలోవ టిఐసి పాయింట్ సమీపంలో ఒక ఇంట్లో నివాసం ఉంటున్న రాపర్తి వంశీ కుమార్(33) వరుణ్ మోటార్స్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ సిఐ సోమశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతికి కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి, . మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. మృతుడు వంశీ కుమార్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని జాతీయ రహదారిపై సారిపల్లిపాలెం జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ కనగ ముత్తు తీవ్రంగా గాయపడ్డాడు. అల్యూమినియం లోడుతో విజయవాడ వెళుతున్న లారీ సారిపల్లిపాలెం జంక్షన్ వద్దకు రాగానే లారీ టైర్ పంచర్ కావడంతో ఆగి ఉన్న మరో లారీని బలంగా ఢీ కొట్టింది. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ కనగ ముత్తు లారీ క్యాబిన్లో స్టీరింగ్ వద్ద ఇరుక్కు పోయాడు. పోలీసులు శ్రమించి బయటకు తీసి వైద్యం కోసం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కేడిపేట పిహెచ్‌సి పరిధి కొంగసింగి గ్రామ సమీపంలో ఐదు లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేశామని కేడిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. కొయ్యూరు మండలానికి చెందిన దిబ్బా శంకరరావును అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో అన్నవరం గ్రామంలో బుధవారం భారీగా సారా పులుపును స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ శివారున అక్రమంగా తయారు చేస్తున్న సారా పులుపును, సామగ్రిని సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు.

రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - ఆరిలోవ : రేషన్ డిపోలో అనధికారికంగా నిల్వ ఉంచిన 1970 కిలోల రేషన్ బియ్యాన్ని విజలెన్స్ అధికారులు బుధవారం సీజ్ చేసారు. సివిల్ సప్లై ఆర్ఐ రమేష్ తెలిపిన వివరాలివి. హనుమంతువాక సమీపంలో సంజయ్‌గాంధీ కాలనీలో డిపో నెంబరు 220లో అనధికారికంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజెలెన్స్ అధికారుల సోదాలో పట్టుబడింది. విజిలెన్స్ సిఐ లక్ష్మోజీ ఆధ్వర్యంలో సిబ్బంది నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసారు.

అనధికార నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 24వ వార్డు నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలపై జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటి శ్లాబుకు రంధ్రం పెట్టడం ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ అనధికారికంగా వేసిన శ్లాబ్ తొలగించామన్నారు. జోన్ పరిధిలో అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగిస్తున్నామని, అందులో భాగంగానే మెయిన్‌రోడ్డులో ఆక్రమించి, అనధికారికంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపైనా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చైన్‌మ్యాన్ ప్రసన్నకుమార్, వార్డు. ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధిద్దాం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్లాట్‌ఫామ్ 65 రెస్టారెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఎర్త్ డే పురస్కరించుకొని ప్లాట్ ఫామ్ 65 ఆధ్వర్యాన బుధవారం బీచ్ క్లీనింగ్‌డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం అధికం అవటం వల్ల వాతావరణంలో కలిగిన మార్పులతో భూమిలో అధిక శాతం వేడి ఉత్పత్తి అవుతుందన్నారు. తద్వారా వ్యవసాయం సరిగ్గా దిగుబడి రాకపోవడం, నీరు కాలుష్యం కావడం సముద్రంలో జీవరాశులు మృతి చెందడం జరుగుతున్నాయని వివరించారు.

సేవా కార్యక్రమాలతో సురేష్ పుట్టినరోజు వేడుక

కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ జన్మదిన వేడుకలు పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుండి పారిశ్రామికవాడలో పలుచోట్ల స్వచ్ఛందంగా సేవాకార్యక్రమాలను నిర్వహించారు. వార్డు పరిధిలో 13చోట్ల పివి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సురేష్ ప్రారంభించారు. పలుచోట్ల కేక్ కటింగులు, పేదలకు నిత్యావసరాలు, బట్టలు పంపిణీ చేశారు. సాయంత్రం స్థానిక కోరమండల్ క్రీడామైదానం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు నేతలు పివి సురేష్ సేవలను అభినందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవివి. సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్ఆర్ టియుసి జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, పలువురు కార్పొరేటర్లు, పార్టీలకతీతంగా నేతలు, మహిళలు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి

మన షూ కంపెనీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి -ములగాడ : పెదగంట్యాడలో 'మన' షూ కంపెనీ ఏర్పాటుతో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో షూ కంపెనీకి సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి అమర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు మాట్లాడుతూ బ్రోచర్ను ఆవిష్కరించిన ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా బూట్లు తయారీ మినీ పరిశ్రమను పెదగంట్యాడలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డులో రూ.27 లక్షలతో పలు అభివృద్ధి పనులకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్, సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. హిమాచల్‌నగర్ ,నూకాంబిక దేవాలయం వద్ద రూ.27 లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు, రక్షణ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.గడచిన పదిరోజుల్లోనే రూ.34లక్షలతో పనులకు శంకుస్థాపన చేశామని, మున్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఆనందకుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పుల్లె సురేష్ యాదవ్, వార్డు ఇన్‌ఛార్జి రేవళ్ల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు గాలి సన్యాసిరావు, రాజశేఖర్, కృష్ణప్పారావు, పెద్దిరాజు, బుల్లబ్బాయి, ఖాన్, సంపత్, గ్రామ కార్యదర్శి నమ్మి గౌరీశ్వరరావు, సచివాలయ సిబ్బంది, నాయకులు, సిఐ మహదేవి, ఆర్‌పిలు తెరిసా, రాజ్ కమల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

నిబంధనలు అతిక్రమించిన చైతన్య కాలేజీపై ఆగ్రహం

చైతన్య కాలేజీని తనిఖీ చేస్తున్న కమిషన్ చైర్మన్, సభ్యులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రత్యేక తరగతులు, శిక్షణ పేరిట వేసవి సెలవుల్లోనూ విద్యాలయాలను తెరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. కమిషన్‌కు కోకొల్లలుగా అందుతున్న ఫిర్యాదుల మేరకు బుధవారం రామాటాకీస్ ప్రాంతంలో శ్రీచైతన్య కాలేజీని ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో అక్కడ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గుర్తించి, యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి విద్యార్థులు, యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు విద్యార్థులు కమిషన్ దృష్టికి తెచ్చిన నేపథ్యంలో మండిపడిన చైర్మన్ అప్పారావు, సభ్యులు సీతారాం స్పందిస్తూ వెంటనే విద్యార్థులందరినీ బయటకు పంపేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాలయాలు వేసవి సెలవులను విధిగా పాటించాల్సిందేనని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కళాశాల గుర్తింపు రద్దు చేయక తప్పదని హెచ్చరించారు. అన్ని జిల్లాల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలలు కాలేజీలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, మండుటెండల్లో వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ తరగతులను నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యటనలో బాలల సంరక్షణ విభాగం జిల్లా ప్రతినిధి ఎ.ఆనంద్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పలువురు సీనియర్ సివిల్ జడ్జిలకు స్థానచలనం

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ సివిల్ జడ్జీల సాధారణ బదిలీలలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ న్యాయమూర్తులకు స్థానచలనం కలిగింది. బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు విశాఖ నగరంలో రెండవ అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న సి.హెచ్ వివేకానందను ఇక్కడే ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.. ఆ స్థానంలో పనిచేస్తున్న ఎస్.సుజాత కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.. విశాఖపట్నం రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా అనంతపురం జిల్లా కదిరి సీనియర్ సివిల్ జడ్జి మట్ట వెంకటేశ్వరరావు బదిలీపై వస్తున్నారు. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న కెబివి బులిక్రిష్ణను ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేయగా, ఈ స్థానంలో గుంటూరు జిల్లా రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎంవి శేషమ్మ బదిలీపై వస్తున్నారు. విశాఖపట్నం ఆరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న జి చంద్రమౌళీశ్వరిని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఈ స్థానంలో గుంటూరు జిల్లాలో ప్రస్తుతం జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ సెక్రటరీగా పనిచేస్తున్న కె.రత్నకుమార్ బదిలీపై వస్తున్నారు. అనకాపల్లి రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న హెచ్ అమర్‌రంగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. నర్సీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న టి.కళావతిని గుంటూరు జిల్లా రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. వీరంతా తమ తమ బదిలీ స్థానాల్లో మే రెండో తేదీలోపు విధులను స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా గిరిధర్

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఆలపాటి గిరిధర్‌ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఈ స్థానంలో పనిచేస్తున్న గుత్తల గోపిని విశాఖపట్నం ఆరిలోవలో ఉన్న సేల్స్ టాక్స్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బదిలీ చేశారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నెమలిపురికి చోటు

ఎయు విసి నుంచి అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నెమలిపురి సత్యనారాయణకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 'ప్రిజన్ రైటింగ్ డ్యూరింగ్ ఎమెర్జెన్సీ ఇన్ ఇండియా - ఎ స్టడీ' పేరిట సమర్పించిన థీసెస్‌కు ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న తొలి భారతీయునిగా నిలిచిన నెమలిపురి సత్యనారాయణ ప్రతిభను గుర్తించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి అభినందించింది. ఈ మేరకు ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి, జిల్లా ఇన్‌ఛార్జి వి.భాస్కరాచారి, ఎయు రిజిస్ట్రార్ కృష్ణమోహన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా దేశ, ప్రపంచ దేశాల జైలు సాహిత్యం అధ్యయనం చేసి, వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారని నెమలిపురి తెలిపారు. ఇప్పటికే పశ్చిమ యూరోప్ దేశాల విశ్వ విద్యాలయాల్లో జైలు సాహిత్యానికి ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. కాగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కించుకున్న నెమలిపురి సత్యనారాయణను పలువురు అభినందిస్తున్నారు.

ముస్లిం కుటుంబాలకు నిత్యావసరాలు

స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ వితరణ

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : రంజాన్ పండుగను పురస్కరించుకుని 20 నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నెలకు సరిపడా 11రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ముస్లిం మత పెద్దలు షేక్ అన్వర్, తాజుద్దీన్, అంజు, భాషా, తదితరుల సమక్షంలో ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

కృష్ణమూర్తి మృతి తీరని లోటు

ప్రజాశక్తి -తగరపువలస : సిపిఎం సీనియర్ నేత డాక్టర్ కృష్ణమూర్తి మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, సిఐటియు జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు, నాయకులు ఎస్ అప్పలనాయుడు అన్నారు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కృష్ణమూర్తి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా కార్యాలయం కార్యదర్శి, ఇతరత్రా బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గడపగడపలో సమస్యలు తెలుసుకుంటున్న రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పుట్టిన బిడ్డ దగ్గర నుంచి అరవై ఏళ్ళు దాటిన వృద్ధుల వరకు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె.కె.రాజు అన్నారు. బుధవారం47వ వార్డు పరిధిలోని అంబేద్కర్ ఎస్టేట్, రామ్‌నగర్‌తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వసంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌లో ఉన్న ప్రజలకు సేవ చేయాలనే పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వాన్ని అందరం ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో జగన్‌కు అండగా నిలబడాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, డైరెక్టర్లు రాయుడు శ్రీను, వార్డు నాయకులు పాల్గొన్నారు.

వ్యాధి పీడితులకు ఆర్థిక సాయం

చెక్కు అందిస్తున్న సాంబమూర్తి

ప్రజాశక్తి-పెందుర్తి : మానవతాదృక్పథంతో ఇతరులకు, అందులోనూ కష్టాల్లో ఉన్నవారికి సేవ చేయడం అభినందనీయమని ఎయు డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి అన్నారు. బుధవారం 93వ వార్డు కృష్ణానగర్‌లో ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ ఆధ్వర్యంలో వ్యాధిపీడితులకు ఆర్థికసాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈసందర్భంగా సామాజిక బాధ్యతగా హ్యూమన్ రైట్స్ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించి, ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా చేరిన సభ్యులకు సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా ఐహెచ్ఆర్‌సి చైర్మన్ రాజాన ప్రసాదరావు సంస్థ చేపట్టిన, భవిష్యత్‌లో చేయనున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నేషనల్ యూత్ ప్రెసిడెంట్ సుగుణాకర్, సెక్రటరీ ఇషిత, జాయింట్ సెక్రటరీ రిషిత, కోశాధికారి విజయ, నేషనల్ జనరల్ సెక్రటరీ ఎ.హ్యాపీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐఎస్‌రాజు, టి.రవికుమార్ ఎంవి. రాజశేఖర్, టి హరిబాబు, జి.రాజశేఖర్, పోషరాం, పి ఈశ్వరరావు దుర్గారావు,డేవిడ్, బి రమేష్, ఉమామహేశ్వరరావు శ్రీనివాసరావు, కృష్ణ, గణేష్, అప్పారావు పాల్గొన్నారు.

'విష్ణు కెమికల్స్'లో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు
- సమగ్ర విచారణకు సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ ఫార్మా సిటీలోని విష్ణు కెమికల్స్‌లో షట్‌డౌన్ అనంతరం శుభ్రం పనులు మంగళవారం సాయంత్రం నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇండస్ (26) ఉమా శంకర్ (25) ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... విష్ణు కెమికల్స్ లిమిటెడ్ కంపెనీని ఈ నెల 15న షట్‌డౌన్ చేసి క్లీనింగ్ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా శుభ్రం చేసే పనులు చేస్తుండగా, మంగళవారం సాయంత్రం 8 గంటల సమయంలో క్రోమ్ - సోడా యాష్ గల మిశ్రమం బూడిద ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు ఇండస్, ఉమాశంకర్ శరీరంపై పడింది. దీంతో వారి శరీరమంతా కాలి బొబ్బర్లు వచ్చాయి. వెంటనే వారిద్దరినీ విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వీరిలో ఇండస్ అనే కార్మికుడు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటనపై విచారణ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు పరవాడ సిఐ ఈశ్వరరావు తెలిపారు.

సమగ్ర విచారణ చేపట్టాలి : సిఐటియు

విష్ణు కెమికల్స్ కంపెనీ,

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

ఈ ఘటన తెలిసిన వెంటనే ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ కంపెనీని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం జరిగిన ప్రమాదాన్ని కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచడం విచారకరమన్నారు. ఈ ఘటనపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు, ఫైర్ సర్వీస్ అధికారులు సమగ్ర విచారణ చేసి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల రక్షణ, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలపై విచారణ చేసి గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్యం అందించి వారిని ఆదుకోవాలని కోరారు. వైద్య కాలం మొత్తం వేతనం చెల్లించాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి వెంకునాయుడు పాల్గొన్నారు.

మళ్ల సత్యనారాయణ కుటుంబాన్ని ఓదార్చుతున్న దాడి వీరభద్రరావు

మళ్ల సత్యనారాయణ కుటుంబానికి దాడి పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కామ్రేడ్ మళ్ల సత్యనారాయణ ఈనెల 17న మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు పరామర్శించారు. మళ్ల సత్యనారాయణ ఇంటికి వీరభద్రరావు వెళ్లి ఆయన కుమారులు డాక్టర్ జగదీష్, సుందర వాసు, సోదరుడు జగన్మోహనరావులను ఓదార్చారు.

వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : వైసిపి మండల స్థాయి విస్తృత సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ వచ్చే శుక్రవారం గొర్లివానిపాలెం పంచాయతీ జెన్నూర్మ్ కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంను టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎంపిపి, జెడ్పిటిసి, సర్పంచ్‌లు, ఎంపిటిసీలు అందరూ కృషి చేసి వెయ్యి బైక్‌లతో ర్యాలీగా వెళ్లి స్వాగతం పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పిటిసి పిఎస్ రాజు, వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, కార్పొరేటర్లు బొట్టు సూర్యకుమారి, ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, పార్టీ నాయకులు కోన రామారావు, చుక్క రామునాయుడు, వెన్నెల సన్యాసిరావు, ఎంఎస్ఎంఈ డైరక్టర్ దలాయి నదియా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆటో కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక రింగ్ రోడ్, నెహ్రూ చౌక్ జంక్షన్‌లో ఆటో కార్మికులతో బుధవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పోలీసులు తీస్తున్న ఈ-చలానాలను వెంటనే రద్దు చేయాలన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను తగ్గించాలని, అనకాపల్లి పట్టణంలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు కోన లక్ష్మణ, వైఎన్ భద్రం, ఆటో యూనియన్ నాయకులు కోరుబిల్లి జగదీష్, ఆటో కార్మికులు కృష్ణ, పెంటకోట రాము, కట్ట మాణిక్యం, ధర్మ, ఎస్ అప్పారావు, ఎలుగుబంటి శంకర్, దొంగ ఈశ్వరరావు, తిమ్మ గాలి బాబు, గొర్లి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం రామాలయం వద్ద బుధవారం అనిల్ నీరుకొండ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ సంతోష్, గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష, కంటి వైద్యులు డాక్టర్ రుక్సాన, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ అనూష, ఎముకలు, కీళ్ల వైద్యులు డాక్టర్ జనిత్ తదితరులు పాల్గొని సుమారు 250 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన రోగులను ఆపరేషన్ నిమిత్తం హాస్పటల్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ ఈశ్వరి, సూరిరెడ్డి గాంధీ, జనిత్, ధనరాజ్, మాజీ ఎంపిటిసీ గండి రవికుమార్, అంగటి నాని, వెన్నెల శంకర్, కొటాన దేవుడు, వార్డ్ మెంబర్లు, పంచాయతీ సెక్రెటరీ సంతోష్, ఎంఎల్‌హెచ్ పి సుజాత, ఏఎన్ఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మందులు అందజేస్తున్న నిర్వాహకులు

డిఇఒకు అంబేద్కర్ చిత్ర పటాన్ని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనకాపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వర్క్ అడ్జస్ట్మెంట్‌లో భాగంగా వివిధ పాఠశాలల్లో నియమితులైన ఉపాధ్యాయులను విద్యా సంవత్సరం ముగిస్తున్నందున ఏప్రిల్ 29 లోగా వారి పాత స్కూళ్లకు రిలీవ్ చేయాలని కోరారు. స్పాట్ వాల్యూయేషన్కు సంబంధించి 55 సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులను, స్పాండిలైటిస్, దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతున్న వారిని, గర్భిణులు, చంటి పిల్లల తల్లులను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. స్పాట్ వాల్యుయేషన్కు అర్హత ఉండి ఆర్డర్ రాని ఉపాధ్యాయులు స్పాట్ వేల్యూషన్కు అంగీకరిస్తే ఆర్డర్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా డిఇఓ వెంకట లక్ష్మమ్మకు అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్న అబ్బాయి, నాయకులు పాల్గొన్నారు.

29 నుండి జీవన విద్యపై ఆవాస శిబిరం

ప్రజాశక్తి -అనకాపల్లి

సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్మెంట్ ఆఫ్ హ్యూమన్ కాన్షియస్నెస్ (సిహెచ్ డిహెచ్సి), ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధన సంస్థ సంయుక్తంగా జీవన విద్య ఆవాస శిబిరాన్ని ఈనెల 29 నుంచి మే 1 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోడూరు గ్రామంలో ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధన సంస్థలో జరిగే ఈ శిక్షణ ద్వారా పలు మానసిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. జీవన విద్య విధానం ద్వారా తమను తాము చక్కదిద్దుకునే అవకాశం, సంతోషకర జీవితాన్ని గడిపేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మూడు రోజులపాటు శిబిరంలో పాల్గొనేవారు వెయ్యి రూపాయల రిఫండబుల్ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు తెలుగులోనే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచిత వసతి, భోజనం కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు www.chdhc. org/online లేదా 9948885111 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రుషిల్ డెకార్ ముఠా కార్మికుల సమస్యలపై చర్చలు

15వ రోజు కొనసాగిన ఆందోళన

చర్చలు అనంతరం మీడియాతో మాటాతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి, అచ్యుతాపురం

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని రుషిల్ డెకార్ ప్లైవుడ్ కంపెనీ ముఠా కార్మికుల సమస్యలపై అనకాపల్లి కార్మిక శాఖ కార్యాలయంలో బుధవారం చర్చలు జరిగాయి. ఈ చర్చలు కొంతమేరకు కొలిక్కి రాగా, తదుపరి చర్చలు 26వ తేదీ వాయిదా పడ్డాయి. ముఠా కార్మికులకు పాత పద్ధతిలోనే కూలి రేట్లు చెల్లించాలని కోరుతూ కంపెనీ ఎదుట చేపట్టిన ఆందోళన 15వ రోజు బుధవారం కూడా కొనసాగింది. కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టికి ముఠా కార్మికులు వినతి పత్రం అందజేసిన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు బుధవారం అనకాపల్లి కార్మిక శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇందులో కంపెనీ ప్రతినిధులు పిఆర్ఓ నాగేష్, హెచ్ఆర్ మేనేజర్ రమేష్, కార్మిక శాఖ ఏసీఎల్ సువర్ణ, ఏఎల్ఓ బాలకృష్ణ, కార్మికుల తరుపున సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకరరావు, జి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్ రాము, దిబ్బపాలెం అభివృద్ధి కమిటీ చైర్మన్ బి రామదాసు, శ్రీరామ ముఠా కార్మిక సంఘం నాయకులు నానాజీ, సూరిబాబు, అప్పలనాయుడు చర్చల్లో పాల్గొన్నారు. కార్మికులకు లారీల యజమానులు డబ్బులు ఇవ్వద్దని పరిశ్రమ ఆవరణలో యాజమాన్యం పెట్టిన బోర్డులు తక్షణమే తొలగించాలని కార్మిక ప్రతినిధులు కోరగా, అందుకు యాజమాన్య ప్రతినిధులు అంగీకరించారు. మిగతా సమస్యలను వారం లోపు యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మినిట్స్ రాసి తయారు చేసి యాజమాన్యం కార్మికులతో ఒప్పందం చేసుకోవడం జరిగింది.

వడదెబ్బతో వ్యక్తి మృతి

ఒంటరైన 18 ఏళ్ల కుమార్తె

ప్రజాశక్తి- వడ్డాది

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం, వడ్డాది గ్రామానికి చెందిన దొండా గోవర్ధనరావు (55) బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు వడగాల్పులకు తట్టుకోలేక మృతిచెందాడు. వ్యవసాయ కూలి పనికి వెళ్లి ఇంటికి వచ్చిన గోవర్ధనరావు ఎండ వేడికి తట్టుకోలేక కుప్పకూలి మృతిచెందాడు. గోవర్ధనరావు భార్య సత్యవేణి కేన్సర్ వ్యాధితో మూడేళ్ల క్రితం మృతిచెందారు. గోవర్ధనరావు తల్లి మూడు నెలల క్రితం మరణించింది. మృతునికి 18 సంవత్సరాల కుమార్తె స్వాతి ఉంది.

కూలిపనికి వెళ్లి ఇంటికి వచ్చిన గోవర్ధనరావు మంచినీరు తీసుకురమ్మని కుమార్తెను అడిగాడు. కుమార్తె లోపలికి వెళ్లి నీరు తెచ్చేసరికి కిందపడి ఉన్నాడు. తండ్రి కింద పడటం చూసి ముఖంపై కుమార్తె స్వాతి నీరు చల్లింది. అయినా లేవకపోవడంతో తండ్రికి ఏమైందోనని కుమార్తె స్వాతి ఏడవడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. తండ్రి మృతిచెందినట్లు వారంతా చెప్పేసరికి స్వాతి రోధనను ఆపడం ఎవరి తరమూ కాలేదు. గతంలో తల్లిని, ఇప్పుడు తండ్రిని దూరం

గోవర్ధనరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె

చేశారు, ఇప్పుడు తాను ఎక్కడ ఉండాలి, ఎలా బతకాలి అంటూ రోధించడంతో అక్కడ ఉన్న వారంతా కంట తడిపెట్టారు. అంత్యక్రియలలో తండ్రికి స్వాతి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

జై భారత్ సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా సాగిస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈనెల 24న విజయవాడ జింఖానా మైదానంలో జరుగు జై భారత్ సత్యాగ్రహ దీక్ష, బహిరంగ సభలను విజయవంతం చేయాలని పిసిసి మాజీ సభ్యులు పిఎస్.దత్తు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నివాసంలో దీక్ష పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బోయిన భానుమూర్తి యాదవ్, నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కాళ్ల వెంకట సత్యనారాయణ, జిల్లా న్యాయవిభాగం అధ్యక్షులు సూరా శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ అనాలోచిత చర్యలు, అక్రమంగా రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దుపై దేశ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సేనాపతి రాజు, కత్తెర శ్రీధర్, కెవి మాణిక్యం, సూరిశెట్టి ఆదిబాబు, వాయిబోయిన రాజు, ఆవాల రామారావు, బి బాలమురళి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి లంకెలపాలెంలోని అభివృద్ధి పనులను ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని రెండు శ్మశాన వాటికలకు, పరదేశిమాంబ గుడి తదితకర ప్రాంతాల్లో రూ.6.83 లక్షలతో విద్యుత్ స్తంభాలు, లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులు మంజూరు చేసినందుకు జివిఎంసి కమిషనర్‌కు కార్పొరేటర్ రౌతు శ్రీనువాస్ కృతజ్ఞతలు తెలిపారు. అగనంపూడి, దేశపాత్రునిపాలెం, లంకలపాలెంలో నాలుగు రింగు లైట్ల పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

రైతులతో వ్యవసాయ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామంలో రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు, శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం సమావేశమయ్యారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నైరా వ్యవసాయ కళాశాల బిఎస్‌సి ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఎం.తులసి, బి.శ్రావణి, కె.ప్రమీల, టి.యామిని, సిహెచ్.నీరజ తమ గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమాన్ని హరిపాలెం గ్రామంలో చేస్తున్నారు. ఇందులో భాగంగా నైరా వ్యవసాయ కళాశాల ఎడి డాక్టర్ డి.శ్రీనివాస్, ఎడిఆర్ డాక్టర్ స్పందన, కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం పిసి డాక్టర్ రాజ్ కుమార్, టిఓటి డాక్టర్ ఎన్ కిషోర్ కుమార్ ఇందులో పాల్గొన్నారు. గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలు, వారు పండిస్తున్న ముఖ్యమైన పంటలు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు.

కంపోస్టు యార్డు తరలించకుంటే ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో అనధికారికంగా నిర్వహిస్తున్న కంపోస్టు యార్డును తక్షణమే తరలించకుంటే జనసేన పార్టీ ఆధ్వర్యంలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపడతామని ఆ పార్టీ నాయకులు కోట్ని సూరిబాబు, మంగ ఈశ్వర్, విల్లూరి హరి, దుడ్డు నాగేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం జోనల్ కమిషనర్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు నలుగురు కమిషనర్లు మారారని, పలుమార్లు తరలించాలని మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. కంపోస్ట్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మజ్జి శ్రీను, యాలకుల సత్య, మద్దాల రాంజీ, వాసంశెట్టి వంశీ పాల్గొన్నారు.

జిఇఎం-23కు బేస్‌లైన్ సర్వే

ప్రజాశక్తి-పరవాడ : బాలికా సాధికారత మిషన్-2023 విద్యార్థుల జ్ఞానస్థాయిని అంచనా వేయడానికి ఎన్‌టిపిసి సింహాద్రి బుధవారం 51 మంది జిఇఎమ్ విద్యార్థుల కోసం బేస్‌లైన్ సర్వేను నిర్వహించింది. సమీపంలోని 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను పరిశీలించారు. జిఇఎమ్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నుండి ట్రైనింగ్ కోఆర్డినేటర్ల ద్వారా సర్వే నిర్వహించారు. వర్క్‌షాప్ సరదాగా నేర్చుకోవడం కోసమని, ఇది మీకు సంబంధాలు, వ్యక్తిత్వ వికాసం, శుభ్రత వంటి వాటికి సహాయపడుతుందని పేర్కొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ రూ.15 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, సర్పంచ్ నేబర్తి శ్రీను, సెక్రటరీ బ్రహ్మ పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న లక్ష్మి తదితరులు

ప్రజాశక్తి-పరవాడ

సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతి కార్యక్రమం మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి గౌతు లచ్చన్న నగర్ కూడలిలో స్వర్ణాంధ్ర మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పిఎస్.రాజు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు, మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, ఈ బోనింగ్ ఉప సర్పంచ్ బుగిడి రామ గోవింద, బర్నికం సర్పంచ్ పెద్దిరెడ్డి పూజ రాజశేఖర్, సొసైటీ అధ్యక్షులు జివిఎస్ నాయుడు, రేలంగి ధనరాజు, నారాయణ, కృష్ణమూర్తి, పైల అప్పారావు, బుగిడి రమణ, పైల రాధాకృష్ణ, కరగాని సూరిబాబు, పైల ప్రశాంత్, పోలిరెడ్డి వెంకట్రావు, రాయవరపు సన్యాసిరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న విశేష కృషి చేశారని అనకాపల్లి బీసీ సంఘం నాయకులు విత్తనాల పోతురాజు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగిన లచ్చన్న 17వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఎస్ సత్యనారాయణ, జి వెంకటేశ్వర్లు, దేవుడు బాబు, జివిఎస్ నారాయణ, కోన శ్రీను, కొల్లి సత్యారావు, కోన లక్ష్మణ, మత్తుర్తి సూరిబాబు పాల్గొన్నారు.

గాజువాక : బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న ఎపి స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్, న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. బుధవారం గౌతు లచ్చన్న 17వ వర్ధంతి సందర్భంగా వడ్లపూడి గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీషర్లకు వ్యతిరేకంగాస్వాతంత్ర్య పోరాటంలోనూ, విదేశీ వస్తు బహిష్కరణ వంటి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాత శెట్టిబలిజ గౌడ ఈడిగ శ్రీశైల సంక్షేమ సంఘం అధ్యక్షులు అండిబోయిన అప్పారావు, కణితి కాలనీ రథాలమ్మ సంఘం ప్రతినిధి పోతల కృష్ణ, యాత సంఘం సభ్యులు నెల్లి సాధూరావు, దొమ్మేటి రమణారావు, ఎలమంచిలి మంగరాజు, గోవింద గౌడ్, నడిగట్ల గురుమూర్తి, కడవల నాయుడు పోలవరపు రమణబాబు పాల్గొన్నారు

అచ్యుతాపురం జంక్షన్‌లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

'దుర్గంధపూరితం అచ్యుతాపురం జంక్షన్' అనే శీర్షికతో ప్రజాశక్తి ఈ నెల 17న సోమవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. అచ్యుతాపురం జంక్షన్‌లో రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీటిని అరికట్టడానికి మోసయ్యపేట పంచాయతీ కార్యదర్శి దుర్గా సత్య ఫణీంద్ర చర్యలు చేపట్టారు. సోమవారమే పనులు ప్రారంభించినప్పటికీ మనుషులు చేయలేక జెసిబి సహాయంతో పనులు చేయించాలని నిర్ణయించారు. బుధవారం ఉదయం జెసిబి సహాయంతో అచ్యుతాపురం జంక్షన్ మోసయ్యపేట పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను జెసిబి సహాయంతో పూడిక తీయించారు. కాలువలో పూడికపోయిన మట్టిని తొలగించారు.. డ్రైనేజీలు శుభ్రం చేయడంతో కాలువ నుండి రహదారిపైకి మురుగునీరు ప్రవహించడం ఆగింది.

డ్రైనేజీలో చెత్త, పూడికను జెసిబితో తీస్తున్న దృశ్యం

పలుచోట్ల 'మా నమ్మకం నువ్వే జగన్'

మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను పంపిణీ చేస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం సంతోషిమాత ఆలయం సమీపంలో పొలిమేర వీధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, వాలంటరీ వ్యవస్థ పనితీరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 81వ వార్డు కార్పొరేటర్ పీల లక్ష్మి సౌజన్య రాంబాబు వార్డులో పథకాలు అమల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుతాపురం, మడుతూరు, ఉప్పవరం, నరేంద్రపురం, ఎం.జగన్నాథపురం, నునపర్తి, ఎర్రవరం, చీమలపల్లి, మార్టూరు తదితర గ్రామాల్లో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు చేపట్టారు. ఇంటింటికి తిరిగి గృహ యజమానులను కలుసుకొని పార్టీ అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి వైసిపి పాలనపై వారి అభిప్రాయాలను సేకరించారు. వారి అంగీకారం మేరకు ఇంటి గోడలపై స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కె.విమలానాయుడు, ఎం.సంజీవ్, ఎస్.జువాల నాయుడు, సియాద్రి నాగ నూకరాజు, పి వాసు, భీముని వెంకటేశ్వరరావు, చుక్క అనురాధ, చిన్ని శ్రీనివాసరావు, గంగిరెడ్డి రాము, కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పలు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను నిర్వహించడం హర్షణీయమని రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు, విశాఖ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ సభ్యులు అగ్రెపు కామేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి వద్ద వాసవి స్వయంసేవ ట్రస్ట్ సభ్యులు కడిమిశెట్టి సతీష్, బత్తుల గణేష్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం సభ్యులు 200 రోజులపాటు ప్రజల దాహార్తి తీర్చే విధంగా మజ్జిగ, నిమ్మ సోడా, చల్లటి నీరు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలోన్యాయవాది కేపీవీ రమణయ్య, పద్మనాభం ప్రసాద్, కొత్త గోపాలకృష్ణ, తాటికొండ జీవన్, అన్నం రాజశేఖర, నుదురుపాటి తాతాజీ, వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ శ్రీనివాసరావు మంగరాజు, బత్తుల సతీష్, పూసర్ల రాజు పాల్గొన్నారు.

మోహన్ యూత్ ఆధ్వర్యంలో

స్థానిక మెయిన్ రోడ్డు కోర్టు భవన సముదాయం వద్ద బుధవారం హనుమాన్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర బీసీ సాధికారత సమితి కన్వీనర్ మల్ల సురేంద్ర చేతులమీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ యూత్ సభ్యులను సురేంద్ర అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు మారిశెట్టి బాల, శరగడం శాంతారాం, దిమిలి కృష్ణ, సత్తిబాబు, ఉల్లికొండ వేణు, మద్దాల ఆది, గజ్జవరపు ఉపేంద్ర, బడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని సంపతిపురం గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా చెరువు పనులను ఎంపిపి గొర్లి సూరిబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో నీడనిచ్చేందుకు తాటాకు పందిళ్లు వేయాలని, మంచి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం రూ.272 గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుప్రియ, సర్పంచ్ నంబరు లక్ష్మి శ్రీను, వైసిపి నాయకులు పల్లా శ్రీను, ఒమ్మి రమణ, నాగేశ్వరరావు, గొలగాం, శంకరం సర్పంచ్‌లు శలపరెడ్డి లక్ష్మీ నరసింహ, పసుపులేటి లక్ష్మి రామకృష్ణ, ఎంపీటీసీ మొల్లేటి హైమ శివాజీ, కడిమిశెట్టి గణేష్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు మే 7న రాంబిల్లి మండలం వెంకటాపురంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడానికి వస్తున్న సందర్భంగా తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం జనసేన పార్టీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ అనకాపల్లి బైపాస్ రోడ్డు జంక్షన్ నుంచి మునగపాక అచ్యుతాపురం మండల కేంద్రంలో మీదుగా వెంకటాపురం వరకు బైక్ ర్యాలీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బి రామదాసు, మెరుగు ప్రవీణ్ కుమార్, చొప్ప శ్రీను, రేఖ రాజు, చోడపల్లి రమణ, అగ్గాల భాస్కరరావు, శ్యామ్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

రూరల్ : రాష్ట్రంలోని అవినీతిమయ వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకం రాజ్యమేలుతున్నాయన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంచుకుంటూ పోతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పార్టీలో చేరిన పలువురికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టెక్కలి పరశురాం, జనపరెడ్డి శ్రీనివాసరావు, సరోజినీ, సత్యనారాయణ, పైల అప్పలనాయుడు, బైలపూడి రామదాసు, కాళ్ళ చంద్రమోహన్, పాలిపిని రాము, ఎల్లపు సంతోష్ ఆడారి ప్రసాద్, పిట్ట వెంకటరెడ్డి, కోరుకొండ కాశి ప్రభాస్, శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన నాయకులు సుందరపు విజయ్‌కుమార్

పాడి రైతుల అభ్యున్నతికి కృషి

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్

ప్రజాశక్తి-నక్కపల్లి:పాడి రైతుల అభ్యున్నతకు ఎనలేని కృషి చేస్తున్నట్లు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. మండలంలోని ఉపమాక లో పాల సేకరణ కేంద్రంను బుధవారం ఉదయం ఆయన సందర్శించారు. పాల సేకరణ విధానాన్ని పరిశీలించారు. సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి కొండబాబు, పాలకవర్గం సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పాల ఉత్పత్తిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, విశాఖ డెయిరీ అందిస్తున్న సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీపై సరఫరా చేస్తున్న సైలాజ్ గడ్డి , పశుదానాను విధిగా పశువులకు మేతగా వాడాలన్నారు. డెయిరీ తరపున అందజేస్తున్న సుఖీభవ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు మేలు జాతి పశువులను కొనుగోలుకు పాడి రైతులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. 2022- 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అత్యధికంగా పాలు సరఫరా చేసిన పాడి రైతులను సత్కరించి, పశువులకు కాల్షియంను ఉచితంగా అందజేశారు. ఉపమాకలో విశాఖ డెయిరీ నిధుల తో కళ్యాణ మండపం నిర్మించాలని సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు ఆనంద్ కుమార్ ను కోరారు. గ్రామంలో కళ్యాణ మండపం లేకపోవడంతో ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధి పరిచాలని, చేతి బోర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపమాక వెంకన్నను ఆనంద్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు , శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి వెంకన్న జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన చందనాడ పాల సేకరణ సెంటర్‌ను సందర్శించి, పాడి రైతుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ, డీజీఎం పాండ్య రాజన్, తుని యూనిట్ మేనేజర్ శ్రీను, సూపర్వైజర్ కిరణ్, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, మాజీ ఎంపిటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరి, గ్రామస్తులు, వేతన కార్యదర్శులు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతును సన్మానిస్తున్న ఆనంద్‌కుమార్

మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి :హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు సంబంధించి న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 503వ రోజుకు చేరింది. బుధవారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, ఇప్పటికే ఉన్న పైపులైన్‌తో ఉపాధి కోల్పోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల స్వామి, కాశీరావు, సోమేష్, నూకరాజు, రాము, పిక్కి కోదండరావు, తాతాజీ, బాపూజీ, అప్పలరాజు, కోటి, వీర్రాజు, కే.కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్. నాగాపురం పంచాయతీ పల్లాపూరులో నిర్మించిన సిసి రోడ్డు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘు రామచంద్రరావు, పిఆర్ జెఇ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సర్పంచ్

పరిశీలిస్తున్న సిబ్బంది

మట్టి నమూనాల సేకరణపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:భూసార పరీక్షలతో మాత్రమే సమతుల్యమైన ఎరువుల వాడకం సాధ్యమవు తుందని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. బుధవారం ఆర్‌బికే సిబ్బందికి మట్టి నమూనాలు సేకరించడం పై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు ద్వారా భూసారాన్ని నిర్ధారించి, దానికి అనుగుణంగా ఎరువులు మోతాదు నిర్ధారించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా చౌడు బారిన నేలలను గుర్తించి బాగు చేసే విధానాలను చేపట్టడం కోసం భూసార పరీక్షలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. సేకరించిన మట్టి నమూనాలను అనకాపల్లి భూ పరీక్షా కేంద్రంకు పంపించడం జరిగిందని వ్యవసాయ అధికారి తెలిపారు.

జిల్లా హాకీ అసోసియేషన్‌లో ఏక పక్ష నిర్ణయాలు తగవు

రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ

ప్రజాశక్తి -నక్కపల్లి :జిల్లా హాకీ అసోసియేషన్‌లో ఏకపక్ష నిర్ణయాలు తగవని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. బుధవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ, నక్కపల్లి హాకీ క్రీడాకారులు గత 8 సంవత్సరాల నుండి హాకిలో రాణిస్తున్నారని, సెలక్షన్ కమిటీలో ఏకపక్ష నిర్ణయాలతో నక్కపల్లి హాకీ క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. యలమంచిలి లో గతంలో సబ్ జూనియర్స్ ఉమేన్, గత శనివారం జరిగిన సీనియర్ హాకీ మెన్ సెలక్షన్స్ లో సెలెక్ట్ కమిటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. నక్కపల్లి క్రీడాకారులకు సెలక్ట్ అయిన లిస్టు అర్ధరాత్రి సమయంలో పంపుతున్నారన్నారు. నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులు శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సమయంలో అందరూ ఎంతో సహకారం అందిస్తూ క్రీడాకారుల అభివృద్ధికి తోడ్పటును అందించేవారన్నారు. ఆంధ్రప్రదేశ్ హాకీ సెక్రటరీ హర్ష వర్ధన్ ఆధ్వర్యంలో జిల్లా అసోసియేషన్ సమన్వయంలో జిల్లా కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ వెంకట సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబురావు దష్టికి సమస్యను తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు ఉపాధ్యక్షులు వీసం నానాజీ, హాకీ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, రామచంద్రరావు, ఎల్లేటి సత్యనారాయణ, కొల్నాటి నానాజీ, గొడుగుల బంగార్రాజు, అల్లాడ కొండ బాబు,మనబాల తాతారావు,ముద్దా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

ఉపాధి హామి కూలీలకు వేతనం పెంచాలి

మాట్లాడుతున్న సత్తిబాబు

ప్రజాశక్తి-గొలుగొండ:ఉపాధి హామీ కార్మికులకు రోజువారి వేతనం రూ.600కు పెంచాలని, ఉపాధి హామీ కార్మికుల పని దినాలు పెంచాలని, పాత మాస్టర్ విధానాన్నే కొనసాగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.సత్తిబాబు డిమాండ్ చేశారు. బుధవారం గొలుగొండ మండలం ఎర్రవరంలో ఉపాధి హామీ కార్మికులతో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిధులను తగ్గించేస్తుందని ఫలితంగా పని దినాలు తగ్గిపోతున్నాయన్నారు. క్రమంగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. ఆ ఉద్దేశంతోనే నిధులు తగ్గించేస్తుందని ఈ సంవత్సరం 30 వేల కోట్ల రూపాయలు నిధులు కోత పెట్టిందన్నారు. ఫలితంగా పని దినాలు తగ్గుతాయని, గతంతో పోల్చుకుంటే పని దినాలు బాగా తగ్గాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పనికి వచ్చే అనేక పథకాలకు నిధులు తగ్గించేస్తుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని మొత్తంగా అమ్మేయడంతో బడుగు బలహీన వర్గాలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తుందని విమర్శించారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెదపూడి శివ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహించారు. మండల కన్వీనర్ పాణి శాంతారాం, గ్రామ సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిపి గజ్జలపు మణికుమారిలు మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్నారు. జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికించారు.

కార్డులను చూపుతున్న నేతలు, మహిళలు

చోరీల నియంత్రణకు నిఘా

ఇన్చార్జి డిఎస్‌పి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:వేసవిలో దొంగతనాలు జరగకుండా పోలీసు గస్తీ, నిఘా మరింత విస్తతం చేస్తామని నర్సీపట్నం ఇన్చార్జి డిఎస్‌పీ కె.ప్రవీణ్ కుమార్ తెలిపారు. వేసవి సెలవులకు వేరే గ్రామాలకు వెళ్లే కుటుంబాలు తమకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. తాళాలు వేసి ఉన్న ఇండ్లను దొంగలు టార్గెట్‌గా చేసుకుం టారని, పోలీసులకు ముందస్తు సమాచారం అందించడంతో ఆ ఇంటి పరిసరాలలో సిబ్బంది గస్తీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. విలువైన ఆభరణాలను, వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. వేసవిలో రాత్రిపూట పోలీసు బీట్ లను పెంచుతామని, ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై మైకు ప్రచారం, కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. అపార్ట్మెంట్లలో నివసించేవారు సెక్యూరిటీ గార్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

హైస్కూల్లో సిబిఎస్ఇ సిలబస్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక 5రోడ్ల జంక్షన్ వద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్) స్కూలుకు 2023 - 24 విద్యా సంవత్సరం నుంచి సిబిఎస్ఈ అఫిలియేష్ కోర్సు మంజూరు అయిందని ప్రదానోపాధ్యాయులు డి.రత్నం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరం నుండి సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తామన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు సౌకర్యాలతో, అత్యుత్తమ బోధన అభ్యాసాలు అదిస్తున్నామన్నారు. సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం సీట్లు పరిమితంగా ఉంటాయన్నారు.

పిహెచ్‌సిలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-గొలుగొండ: కృష్ణదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను మెరుగు పర్చాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కృష్ణదేవిపేట పిహెచ్‌సిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

బోర్లు పరిశీలన

ప్రజాశక్తి-రావికమతం:వైయస్సార్ జలకలో భాగంగా గత ఏడాదిలో కవగుంట గ్రామంలో ఐదుగురు రైతులకు వ్యవసాయ బోర్లను వేయడం జరిగిందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం సోషల్ ఆడిట్ అధికారి వెంకట్రావు రైతులను అడిగి తెలుసుకున్నారు. రిగ్గు వేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామంలో ఐదుగురు రైతులకు సంబంధించి బోర్లకు సుమారు మూడు లక్షల 50 వేల వరకు ఖర్చు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 10 ఎకరాల లోపు భూమి కలిగి ఉన్న రైతులందరికీ బోరు రిగ్గింగ్ తోపాటు విద్యుత్తు, మోటారు సదుపాయం కూడా ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. త్రీఫేస్ లైన్ నుంచి మూడు స్తంభాల వరకు ప్రభుత్వమే ఖర్చు చేస్తుందన్నారు. తదుపరి ఖర్చు రైతు వాటాదనంగా పెట్టుకోవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ కామేష్, టిఏలు మోహన్, బైరాగి, రైతులు వరహాలు, దొర, నాగరాజు, నాయుడు బాబు, అప్పారావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పురపాలక సంఘం ఆద్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి, అబీద్ సెంటర్, చింతపల్లి ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎల్ఐసి బిల్డింగ్, పెదబొడ్డేపల్లి సర్కిల్ తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు ప్రారంభించామని మున్సిపల్ అధికారులు తెలిపారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రంలో ప్రతిరోజూ స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు.

ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి-గొలుగొండ: పెరిగిన ఎండలతో జాగ్రత్తలు పాటించాలని గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఉష్ణోగ్రతలు, వేడి గాలులు అధికం కావడంతో వడదెబ్బ, డిహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారవచ్చునన్నారు. చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు పిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితికి చేరడం వడదెబ్బ లక్షణాలన్నారు. వడదెబ్బకు తగలకుండా నీరు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. లేత వర్ణం తెలికైన కాటన్ దుస్తులు ధరించాలన్నారు. రోజుకు కనీసం 15 గ్లాసులు నీరు తాగాలన్నారు. ఎండ వేళ ఇంటి వద్దనే ఉండాలని, ఒక వేళ బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ వంటివి తీసుకొని వెళ్లాలని తెలిపారు. రోడ్లపై అమ్మే ఆహారం తినరాదన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలని సూచించారు. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజ్ ద్రావణం తాగించాలన్నారు.

స్పందనలో ఫిర్యాదు

-స్పందించిన అధికారులు

-నిర్మించిన పాక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో కొత్తమల్లంపేట పంచాయతీకి చెందిన ప్రసాదుల రాజులమ్మకు కొత్తమల్లంపేట రెవెన్యూ పంచాయతీ ఆర్‌సి నెంబరు 523ఎ/988లో ప్రభుత్వం 2 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసింది. అప్పటి నుండి అదే స్థలంలో పూరిల్లు నిర్మించుకొని నివాసం ఉంటుంది. గత నెల 23న ఇంటిని మరమ్మత్తులు చేయు నిమిత్తం పనులు జరుగుతుండగా తన సోదరుడి కుటుంబ సభ్యులు గొంప లోవ, గొంప దేముడు, గొంప అప్పలనాయుడు, గొంప రాజులు తన ఇంటి స్థలంలోకి వచ్చి దీనిపై తమకు హక్కు ఉందని, వాటా పంపకాలు విషయం తేలేంత వరకు ఎలాంటి మరమ్మత్తులు చేయకుండా ఈ స్థలాన్ని తక్షణమే ఖాళీ చేయాలని బెదిరించి ఇంటి కలపను ధ్వంసం చేశారంటూ సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో బుధవారం రెవిన్యూ అధికారులు దగ్గరుండి పాకను నిర్మించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వీఆర్వో సన్యాసిరావులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాధితురాలు

మాట్లాడుతున్న ఎస్సై ఉపేంద్ర

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని కేడిపేట ఎస్సై ఉపేంద్ర హెచ్చరించారు. బుధవారం కేడిపేటలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శరభన్నపాలెం జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, దీనిపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆటోలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుదల చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించ వద్దన్నారు. ఆటోలకు సరైన రికార్డులు ఎప్పుడు సిద్దంగా ఉండాలన్నారు.

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సింహాచలంలో ప్రచారం చేస్తున్న నాయకులు

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం, సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రచార భేరి కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది.

ప్రజాశక్తి- యంత్రాంగం

మధురవాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మధురవాడ జోన్ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం ఆరో రోజున టైలర్స్ కాలనీ, డాక్‌యార్డు కాలనీ, శ్యాంనగర్, దోభీ కాలనీ ప్రాంతాల్లో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం, సిపిఐ జోన్ కార్యదర్శులు డి.అప్పలరాజు, వి.సత్యనారాయణ మాట్లాడుతూ, 26న కూర్మన్నపాలెంలో నిర్వహించే ప్రచారభేరి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు డి.కొండమ్మ, బి

ప్రచారభేరిలో సిపిఎం, సిపిఐ నేతలు

భారతి, ఎ.గురుమూర్తి రెడ్డి, సిపిఐ కార్యకర్త వి సన్నిపాత్రుడు పాల్గొన్నారు.

గాజువాక: కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలు అప్రజాస్వామికమని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అన్నారు. శ్రీనగర్, సుందరయ్య కాలనీ, దశమకొండ ప్రాంతాల్లో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. వామపక్షాల ప్రచార భేరి పాదయాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. నేతలు నర్సింగరావు, లోకేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పద్మనాభం: దేశాన్ని, మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించడం అత్యంత ఆవశ్యమని సిపిఎం నేత రవ్వ నరసింగరావు అన్నారు. బుధవారం మండలంలోని పద్మనాభం, కృష్ణాపురం గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్రలను నిర్వహించారు. కార్యక్రమములో ఆదినారాయణ, రాము, అప్పారావు, గురువులు పాల్గొన్నారు.

సింహాచలం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నేత బి.వెంకటరావు మండిపడ్డారు. మోడీ విధానాలకు నిరసనగా ప్రచారభేరిలో భాగంగా బుధవారం 98వ వార్డు మార్కెట్ వద్ద సిపిఎం గోపాలపట్నం జోన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ముద్దాడ వరప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సబ్బవరంలో మాట్లాడుతున్న ప్రభావతి

మాధవధార: బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న సాయంత్రం నాలుగు గంటలకు కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు సనపల రామ్‌గోపాలరావు, కె సుధాకరరావు కోరారు. మాధవధార. 48ఏ బస్‌స్టాప్ వద్ద దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నేతలు నాయనబాబు, నర్సింగరావు, శ్రావణ్‌కుమార్, పి.పాండురంగారావు, రాజశేఖర్, ఎస్.సత్యమూర్తి పాల్గొన్నారు.

కలెక్టరేట్, విశాఖ : జగదాంబ జోన్ పరిధిలోని గొల్లలవీధి, లలితాకాలనీ ప్రాంతాల్లో జ్యోతీశ్వరరావు అధ్యక్షతన ప్రచార భేరి పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం నాయకులు వై.రాజు సిఐటియు జగదాంబ జోన్ జనరల్ సెక్రటరీ చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్, హోటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామారావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.సుబ్బారావు, ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పలరాజు, గణేష్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు పాల్గొన్నారు.

సబ్బవరం: బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. ప్రచార భేరిలో భాగంగా మండలంలోని వంగలి గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. సిపిఎం నాయకులు ఉప్పాడ సత్యవతి, యర్రా సోంబాబు, చిన్నికృష్ణ, రామునాయుడు, సోము నాయుడు పాల్గొన్నారు.

చోడవరం : ప్రచార భేరిలో భాగంగా సిపిఎం నాయకులు బుధవారం మండలంలోని లక్కవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు ఎస్‌వి నాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని, బ్యాంకులు, ఎల్ఐసి, వాడరేవులు, రైల్వే, విద్యుత్ ప్రాజెక్టులు, గనులు కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి దేవుళ్ళు, జోగా రాము పాల్గొన్నారు.

బహిరంగసభను జయప్రదంచేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ విశాఖ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 26న కూర్మన్నపాలెంలోని ప్లాంట్ ఆర్చి వద్ద సాయంత్రం 4 గంటలకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పిఠాపురంకాలనీలో ఉన్న సిపిఎం జిల్లా కార్యాయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులతో పాటు రాష్ట్ర నాయకులు కె.లోకనాధం, జెవి.సత్యనారాయణమూర్తి పాల్గొంటారని తెలిపారు. త్యాగాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంటును స్ట్రాటజిక్ సేల్ పేరుతో బిజెపి అమ్మకానికి పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. రెండేళ్లకుపైగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం సాగుతున్నా, మోడీ ప్రభుత్వం ఏదో రూపంలో ప్లాంటును బలహీన పరిచే చర్యలు తీసుకోవడాన్ని తప్పుపట్టారు. వర్కింగ్ క్యాపిటల్, ముడిసరుకు, రైల్వే రేక్స్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, పైడిరాజు

కేటాయించకుండా కావాలనే ప్లాంటును నష్టాల్లోకి నెడుతోందన్నారు. బిజెపి నేతలు పూటకో మాట మాట్లాడి ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు.

ప్రధాన ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, జనసేన, వైసిపికి తమ రాజకీయ ప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు పట్టడంలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, రక్షణకై ఆందోళన బాటపట్టాయని తెలిపారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు ప్రచారభేరి క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాయని, జిల్లా వ్యాప్తంగా దళాలు ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యపరుస్తున్నాయని తెలిపారు. 2 లక్షలు కరపత్రాలు, గ్రూపు మీటింగ్‌ల ద్వారా బిజెపి విధానాన్ని ఎండగడుతున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకుడు వి.కృష్ణారావు, సిపిఐ జిల్లా నాయకుడు సిఎన్ క్షేత్ర పాల్ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి రవాణా

-పట్టించుకోని అధికారులు, సచివాలయాల సిబ్బంది

ప్రజాశక్తి కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో నిత్యం మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు, సచివాలయాల సిబ్బంది పట్టించుకో లేదు. లింగా పురం, కైలాస పట్నం, సుంకపూరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రాత్రి పగలని తేడా లేకుండా అక్రమంగా మట్టి రవాణా జరుగుతుంది. సామాన్యుల ఇంటికి ఒక ట్రాక్టర్ మట్టి కావాలంటే అధికారుల దగ్గర్నుంచి పర్మిషన్ తీసుకోవాలి. ఒకవేళ అధికారులు పర్మిషన్ ఇచ్చినా స్థానిక నేతల అనుగ్రహం కూడా ఉండాలి. స్థానిక నేతల అనుగ్రహం లేకుండా అధికారుల నుంచి మట్టి పర్మిషన్ తీసుకున్న మట్టి మాత్రం ఇళ్లకు చేరదు. ఇటువంటి తరుణంలో స్థానిక అవసరాల కోసం లబ్ధిదారులు మట్టి మాఫియా గ్యాంగ్ సంప్రదించాల్సిందే. వాళ్లు ఎంత అడిగితే అంత ఇచ్చి మట్టి తోలుకోవాల్సిన పరిస్థితి.

మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో అక్రమ లేఔట్లకు మట్టి రవాణా సాగుతోంది. స్థానిక నాయకుల అండదండలతో ఆయా గ్రామాల్లో చెరువుల నుండి మట్టి అక్రమంగా తరలి పోతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పట్టించుకున్న దాఖలాల లేవు.

ఒక్కో సచివాలయంలో దాదాపు పది మంది సచివాలయ సిబ్బంద్లి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రెవెన్యూ సహాయకులు ఇంతమంది నిత్యం ఆయా గ్రామాల్లో విధుల్లో ఉన్నా మట్టి అక్రమంగా రవాణా జరుగుతుంది. బుధవారం ఉదయం లింగాపురం ట్యాంకు నుండి మట్టి అక్రమ రవాణా జరుగుతుండగా, విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లేసరికి వాహనాలను సంకపూర్ తరలించి అక్కడి నుంచి మట్టి తరలించేందుకు సిద్ధమయ్యారు. జగనన్న ఇళ్ల కాలనీలకు మట్టిని తరలిస్తున్నామని కుంటి సాకులు చెబుతున్నారు. వాస్తవానికి జగనన్న కాలనీలకు ఒక్కో లబ్ధిదారుడికి రెండు నుంచి మూడు ట్రాక్టర్ల కంటే మట్టి అవసరం ఉండదు. జగనన్న ఇంటి నిర్మాణం కోసం మట్టికి కనీసం సచివాలయ ఇంజనీర్ అనుమతి కూడా తీసుకోకుండా రవాణా సాగిపోతుంది. రాత్రి సమయంలో అక్రమంగా మట్టి రవాణా కారణంగా రహదారులన్నీ మట్టి రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంత వాసులు కోరుచున్నారు.

లింగాపురం చెరువులో చేపడుతున్న మట్టి తవ్వకాలు

ట్రాక్టర్‌లో మట్టి తరలింపు